## క్లుప్తంగా

### వైభవంగా మరిడమ్మ తల్లి జాతర

కోటనందూరు: భీమవరపుకోట గ్రామదేవత మరిడమ్మ తల్లి జాతర మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన గ్రామ ఆడపడుచులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు గ్రామ పొలిమేర పంట పొలాల్లో వెలిసిన అమ్మవారి ఆలయానికి వెళ్లి పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

### ఉద్యం సర్టిఫికెట్ల అందజేత

గండేపల్లి: మండలంలోని గండేపల్లిలో ఉన్న ఎంఎస్ భవనంలో చిరు వ్యాపారులకు గురువారం ఉద్యం సర్టిఫికెట్లను డీఆర్‌డీఏ అధికారుల చేతుల మీదుగా అందజేశారు. 200 మంది చిరు వ్యాపారులకు ఉద్యం ఆధార్ రిజిస్ట్రేషన్ చేశామన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, పరిశ్రమల కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు కేశవ, బాబురావు, మండల అధికారులు భరత్, అరుణ్ సందీప్, ఏపీఎం సన్యాసిరావు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు


ప్రమాదంలో నుజ్జయిన వాహనం

శంఖవరం: మండలంలోని కత్తిపూడి జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. అన్నవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కత్తిపూడికి చెందిన పెనుబోతుల సుబ్రహ్మణ్యం ముగ్గురు యువకులతో కలిసి కత్తిపూడి నుంచి తుని వైపు వెళుతుండగా పెట్రోల్ బంక్ సమీపంలో ఆగి ఉన్న లారీని వెనుక భాగంలో ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందన్నారు. ఈ ప్రమాదంలో సుబ్రహ్మణ్యానికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై జి.హరిబాబు తెలిపారు.

### రత్నగిరి కిటకిట


సత్యదేవుని దర్శనానికి క్యూ లో నిల్చున్న భక్తులు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయం గురువారం పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులతో కిక్కిరిసింది. సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరులు నిజరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. రత్నగిరికి విచ్చేసిన భక్తులు ప్రతాలాచరించి స్వామివారిని దర్శించారు. సుమారు 30 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించారు. స్వామివారి దర్శనానికి గంట, అంతరాలయ దర్శనానికి అరగంట సమయం పట్టింది. స్వామివారి వ్రతాలు రెండువేలు నిర్వహించారు.

### ఒకేసారి నాలుగు కొలువులు


బండారు శివదేవుడు

తుని రూరల్: మండలంలోని జగన్నాథగిరిలో వ్యవసాయ కుటుంబానికి చెందిన బండారు సింహాచలం, అమ్మాజీ దంపతుల కుమారుడు శివదేవుడు ఒకేసారి నాలుగు ఉద్యోగాలు సాధించాడు. డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టులో జిల్లాలో 18వ ర్యాంకు, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులో జోన్ విభాగంలో 2వ ర్యాంకు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టు జోన్ విభాగంలో 8వ ర్యాంకు, ఏపీఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. సోదరుడు వీర సత్యనారాయణ సీఆర్‌పీఎఫ్ జవానుగా పనిచేస్తూ తనకు ఎంతో ప్రోత్సాహం ఇచ్చాడని ఆయన తెలిపారు. ఇద్దరు కుమారులు ప్రభుత్వ కొలువులు సాధించడంతో ఎంతో సంతోషంగా ఉందని తల్లిదండ్రులు పేర్కొన్నారు.

### చెరువులో మృతదేహం లభ్యం

ప్రత్తిపాడు: మండలంలోని పెదశంకర్లపూడిలో వెంకన్నదొర చెరువులో 57 ఏళ్ల వ్యక్తి మృతదేహం గురువారం లభ్యమైంది. కలువ పువ్వుల సేకరణకై చెరువులోకి దిగి దురదృష్టవశాత్తు నీట మునిగినట్టు భావిస్తున్నారు. పోలీసుల, స్థానికుల కథనం మేరకు పెదశంకర్లపూడికి చెందిన వాసంశెట్టి అగ్గిరాముడు (57) కొన్నేళ్ల క్రితం కుటుంబంతో సహా సామర్లకోటలో స్థిరపడ్డాడు. ఏటా చవితికి కలువ పువ్వుల కోసం వచ్చేవాడు. అయితే ఈసారి మరొక వ్యక్తిని వెంటబెట్టుకుని ఈనెల 26న సాయంత్రం సామర్లకోటలో బయలుదేరి పెదశంకర్లపూడి వచ్చారు. చెరువుకు రెండు వైపులా ఇద్దరు పువ్వులు కోసేందుకు చెరువులోకి దిగారు. ఫోన్ రావడంతో వెంట వచ్చిన వ్యక్తి తిరిగి సామర్లకోట వెళ్లిపోయాడు. పువ్వులు కోసేందుకు చెరువులోకి దిగిన అగ్గిరాముడు నీట మునిగాడు. అతడు తిరిగి రాకపోయే సరికి అతని భార్య వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంకన్నదొర చెరువులో గురువారం మృతదేహం నీటిపై తేలడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. స్థానిక ఎస్సై లక్ష్మీకాంతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# జ్వరమొచ్చింది.!

- విజృంభిస్తున్న వైరల్ జ్వరాలు
- గ్రామాల్లో క్షీణించిన పారిశుధ్యం
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

తుని రూరల్: మండలంలో వైరల్ జ్వరాలతో ప్రజలు హడలి పోతున్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, అధిక వర్షాలు, అపారిశుధ్యం తదితర కారణాలతో అంటు వ్యాధులు, వైరల్ జ్వరాలు చాపకింద నీరులా వ్యాపిస్తున్నాయి. కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండటం, పారిశుధ్య నిర్వహణ లోపంతో పలువురు గ్రామీణులు వాంతులు, విరేచనాలు, జ్వరాలు, దగ్గు, జలుబు, వంటి నొప్పులకు గురవుతూ ఆస్పత్రుల్లో చేరుతున్నారు. తేటగుంట, ఎన్.సూరవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నమోదవుతున్న ఓపీల్లో 30 నుంచి 40 శాతం మంది వీరేనని వైద్యులు పేర్కొన్నారు. పీహెచ్‌సీలు అందుబాటులో లేని గ్రామీణులు అధిక శాతం మంది తుని పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, వేర్వేరు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత లోపించడం, రోడ్లపై వ్యర్థాలు కుళ్లిపోవడంతో దోమలు వ్యాప్తి, అంటువ్యాధులు, వైరల్, టైఫాయిడ్ జ్వరాలకు ప్రధాన కారణమవుతున్నాయి. ఆయా పీహెచ్‌సీ ఆస్పత్రుల్లో రక్త పరీక్షలు చేస్తూ అవసరాన్ని బట్టి ఆస్పత్రిలో వైద్యం అందిస్తున్నారు. తమ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి రక్త పరీక్షలు నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పరిసరాల పరిశుభ్రత, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వైద్యులు తెలిపారు. వాతావరణానికి ప్రభావితమయ్యే వ్యక్తులు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి నీటి కాపడం పెట్టుకోవాలని, చల్ల గాలుల్లో తిరగవద్దని సూచించారు.

**ఇదీ పరిస్థితి**

తుని మండలంలో ఎన్.సూరవరం, తేటగుంట గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఎన్.సూరవరం పీహెచ్‌సీకి ఆ గ్రామస్తులతో పాటు వెంకటాపురం, ఎస్ఎస్‌వీ నగరం, కూటయ్యపాలెం, డి.పోలవరం, అటికెవానిపాలెం, సుభద్రయ్యమ్మపేట, కొలిమేరు నుంచి రోగులు వస్తుండగా.. తేటగుంట పీహెచ్‌సీకి తేటగుంట, గవరపేట, రాజుల కొత్తూరు, యర్రకోనేరు, టి.తిమ్మాపురం, హంసవరం, హెచ్.కొత్తూరు రోగులు వెళుతున్నారు. ఈ రెండు పీహెచ్‌సీ పరిధిలో ఉన్న ఎస్.అన్నవరం, చామవరం, అగ్రహారం, చేపూరు, రాజుపేట, మర్లపాడు, వి.కొత్తూరు, లోవకొత్తూరు, తాళ్లూరు, కుమ్మరిలోవ, రేఖవానిపాలెం, రాపాక, కేఓ మల్లవరం, దొండవాక తదితర గ్రామస్తులు మెరుగైన వైద్యం కోసం తుని పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు తరలిపోతున్నారు. ఎన్.సూరవరం పీహెచ్‌సీలో రోజుకి 80 వరకు ఓపీ ఉంటుండగా.. 50 శాతం మంది వైరల్ ఫీవర్స్, సీజనల్ వ్యాధులకు చికిత్స పొందుతున్నట్టు డాక్టర్ సౌమ్య తెలిపారు. అత్యవసరమైన రోగులను ఆస్పత్రిలోనే ఉంచి సెలైన్లు అందిస్తున్నామని, సూది మందు, మందులు ఇస్తున్నట్టు తెలిపారు. తేటగుంట పీహెచ్‌సీలో రోజు 50 నుంచి 60 మందికి ఓపీ ఉంటుందని, వీరిలో 30 శాతం మంది సాధారణ జ్వరాలతో వస్తున్నట్టు డాక్టర్ నీరజ తెలిపారు. మూడు, నాలుగు రోజులు జ్వరాలతో బాధపడే రోగులకు పీహెచ్‌సీలోనే రక్తపరీక్షలు చేసి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. అత్యవసర వైద్య సేవలు అందించేందుకు అందుబాటులో ఉంటున్నామన్నారు.


పీహెచ్‌సీకి జ్వరాలతో వచ్చిన చిన్నారులను పరీక్షిస్తున్న డాక్టర్ సౌమ్య


పీహెచ్‌సీలో జ్వరం, వాంతులతో చేరి చికిత్స పొందుతున్న రోగులు


ఎన్.సూరవరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద రోగులు

**వాంతులతో బాధపడుతున్నా**

ఇటీవల కొబ్బరికాయల తీతకు ఏలూరు వెళ్లొచ్చాను. మూడు రోజులుగా వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నాను. నీరసంగా ఉండటంతో డాక్టర్ సూచనలతో ఆస్పత్రిలో చేరగా సెలైన్లు ఎక్కిస్తున్నారు.

– ధారా వీరబాబు, ఎస్ఎస్ వెంకటాపురం.

**రెండు రోజులుగా జ్వరం**

రెండు వారాలుగా వర్షాలు కురుస్తుండటంతో కుటుంబ సమేతంగా వ్యవసాయ పనులు చేసుకుంటున్నాం. రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాను. పీహెచ్‌సీకి వస్తే రక్త పరీక్షలు చేశారు. నీరసించిపోవడంతో సెలైన్లు పెట్టారు.

– ఎస్.లక్ష్మి, ఎస్‌బీపేట.

### విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి సన్నాహాలు

అన్నవరం: శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామి ఆలయానికి పశ్చిమ రాజగోపురం ముందు ఉన్న ఖాళీ ప్రదేశంలో భారీ విశ్రాంతి షెడ్డు నిర్మాణ పనులు ఈ వారంలోనే ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు ఆ స్థలాన్ని చదును చేయించే పనులను గురువారం ప్రారంభించారు. విశాఖపట్నానికి చెందిన లారెస్ ఫార్మాస్యూటికల్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వీవీ రవికుమార్ దేవస్థానానికి ఈ నెల రెండో వారంలో లేఖ పంపించారు. సుమారు రూ.1.5 కోట్ల వ్యయంతో 12,500 చదరపు అడుగుల స్థలంలో టెన్సిల్ షెడ్డు (తెలుపు ప్లాస్టిక్ క్లాత్ తరహా షెడ్డు) నిర్మించనున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు.

### అప్రమత్తతే అంటు వ్యాధులకు పరిష్కారం

తుని రూరల్: అప్రమత్తతతోనే అంటు వ్యాధులకు పరిష్కారమని ఎన్.సూరవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రాజశేఖర్ అన్నారు. గురువారం తుని మండలం కేఓ మల్లవరంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సంచార్ వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వాతావరణ పరిస్థితులకు అనువుగా పరిసరాలు పరిశుభ్రత, వ్యర్థాలు, నీటి నిల్వలు ఉండకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కలుషిత నీరు తాగడం, నిల్వ ఆహార పదార్థాలు తినడం చేయకూడదన్నారు. వేడి పదార్థాలు, కాచి చల్లార్చిన నీటిని సేవించాలన్నారు. రెండు రోజులు జ్వరం, తలనొప్పి, దగ్గు, వంటి నొప్పులు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. వైద్య సిబ్బంది ఇంటింటా పర్యటించి, అనుమానితులు నుంచి రక్త నమూనాలు సేకరించారు.

## రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకోవాలి



ప్రత్తిపాడులో విలేకరులతో మాట్లాడుతున్న గొంప శివకుమార్ యాదవ్

ప్రత్తిపాడు: మహాసేన రాజేష్ కుల విద్వేషాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకోవాలని ప్రత్తిపాడు నియోజకవర్గ బీసీవై పార్టీ ఇన్‌చార్జి గొంప శివకుమార్ యాదవ్ హితవు పలికారు. ప్రత్తిపాడులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్‌ను విమర్శించే స్థాయి నీకు ఉందా అని ప్రశ్నించారు. తక్కెళ్లపాడులో శ్రీకృష్ణుడి రూపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తే రామచంద్ర యాదవ్ వ్యతిరేకించడంతో దానిని తొలగించారన్నారు. రాజేష్ ఈ అంశంపై కుల విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యానించడం సబబు కాదన్నారు. బేషరతుగా రామచంద్రకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీవై పార్టీ నాయకులు దేవర శ్రీను, జి.గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్వో ప్లాంటు అందజేత

ఏలేశ్వరం: మండలంలోని తిరుమాలి జెడ్పీ ఉన్నత పాఠశాలకు గురువారం ఉపాధ్యాయుడు హరిచంద్ర శేఖర్ ఆర్వో ప్లాంటును బహూకరించారు. ఇదే పాఠశాలలో గత 8 ఏళ్లుగా పనిచేస్తున్న హరిచంద్రశేఖర్ పాఠశాలపై మక్కువతో రూ.75వేలు విలువ చేసే ప్లాంట్‌ను తన తండ్రి సాంబశివరావు, మామ సుకుమార్‌రాజు జ్ఞాపకార్థం బహూకరించారు. హరిచంద్రశేఖర్ ఇటీవల బదిలీపై మండలంలోని సిరిపురం వెళ్లారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ఆర్గనైజర్ ఇందిరా ప్రియదర్శిని, పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరీటి తదితరులు పాల్గొన్నారు.

### పోలీస్ సిబ్బందికి సన్మానం


గండేపల్లి కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న సీఐ

గండేపల్లి: ప్రతిభ చూపిన పోలీస్ కానిస్టేబుళ్లకు సీఐ శ్రీనివాస్ గురువారం ఘనంగా సన్మానించారు. గండేపల్లి పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్స్ సూరిబాబు, కాశీవిశ్వనాథ్ అదృశ్యమైన మహిళలను గుర్తించడంలో ప్రతిభను కనబరిచినందుకు ఈ సన్మానం చేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా వారికి దుశ్శాలువా కప్పి బహుమతులు అందజేశారు.

### స్మార్ట్ మీటర్లను తిరస్కరించాలి

ప్రత్తిపాడు: స్మార్ట్ విద్యుత్ మీటర్లను ప్రజలంతా ముక్తకంఠంతో తిరస్కరించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రాజు పిలుపునిచ్చారు. అమరవీరుల 25వ వర్ధంతి సభకు ముఖ్యఅతిథిగా హాజరైన బంగార్రాజు మాట్లాడుతూ, ఉమ్మడి రాష్ట్రంలో ప్రపంచ బ్యాంకు ఆదేశిత ప్రభుత్వ విధానాల వ్యతిరేక పోరాటంలో ప్రజల కోసం తృణప్రాయంగా ప్రాణాలర్పించిన అమరుల త్యాగాలను వృధా పోనివ్వరాదన్నారు, రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగిస్తున్న విద్యుత్ సంస్కరణలు, పెంచిన విద్యుత్ చార్జీలు, ట్రూఅప్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు తదతర ప్రజా వ్యతిరేక విధానాలపై లిబరేషన్ పోరాటానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ ఒప్పందాలు, అదనపు యూజర్ చార్జీలు పెరుగుదల, ప్రజలకు అవసరం లేని విద్యుత్ మీటర్లను వ్యతిరేకించాలని కోరారు. లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో మండలంలోని లిబరేషన్ అనుబంధ సంస్థల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతామని లిబరేషన్ నాయకులు, కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు.



ప్రత్తిపాడు లిబరేషన్ కార్యాలయంలో మాట్లాడుతున్న బంగార్రాజు

### నిధి ఆప్‌కే నికట్ సమావేశం

అన్నవరం: ఈపీఎఫ్ఓ నిర్వహించే వివిధ పథకాలు, సేవలు, నియామకాలపై ఉద్యోగులు, యజమానులు, పెన్షనర్స్‌కు అవగాహన కల్పించే నిధి ఆప్‌కే నికట్ 2.0 కార్యక్రమాన్ని గురువారం అన్నవరం దేవస్థానంలో నిర్వహించారు. దేవస్థానంలోని కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈపీఎఫ్ఓ గురించి ఆ సంస్థ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ రాజేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా ప్రతి నెల 27 లేదా 28 తేదీల్లో అన్ని జిల్లాల్లో నిర్వహిస్తున్నామన్నారు. దేవస్థానం సిబ్బంది అడిగిన సందేహాలను ఆయన నివృత్తి చేశారు. సమావేశంలో దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

# గడపకో గణేశుడు

- వైభవంగా గణనాథునికి పూజలు
- ఇంటింటా వెలసిన పాలవెల్లులు
- గ్రామాల్లో నవరాత్రుల సందడి

తుని: ప్రథమ పూజ్యుడు వినాయక చవితి పండుగను భక్తి శ్రద్ధలతో ప్రజలు జరుపుకున్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డు లక్ష్మీ గణపతి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా వినాయకుడిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అర్చకులు ఆశీస్సులు అందజేసి ప్రసాదం అందజేశారు.

శంఖవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వీధుల్లో గణనాథుని విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఆలయాలను మారేడు, నేరేడు తోరణాలతో అలంకరించారు. ఈ వేడుకలు తొమ్మిది రోజులపాటు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక ఆలయాన్ని ఎంపీపీ పర్వత రాజుబాబు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ప్రత్తిపాడు: వాడవాడలా గణనాథునికి ఘనంగా పూజలు నిర్వహించారు. హిందువుల తొలి పండుగ కావడంతో ప్రతి ఇంటా, దుకాణాల్లోనూ వినాయకుడికి పూజలు చేశారు. గణపతికి ఉండ్రాళ్లను నైవేద్యంగా సమర్పించారు. ప్రత్తిపాడులోని తోట వీధి షిర్డీ సాయి మందిరంలో, మునసబు రామాలయం, కూరగాయల మార్కెట్, జక్కావారి రామాలయం, గోకవరపు వీధి, కొత్తపేట తదితర ఆలయాల్లో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెదశంకర్లపూడిలో యువకులు ప్రతిష్ఠించిన గణపతిని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్తిపాడులో ఏర్పాటు చేసిన గణనాథుడిని జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు గుడాల వెంకటరత్నం, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ తదితరులు దర్శించుకున్నారు.

రౌతులపూడి: చవితి వేడుకలను మండల వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని దేవాలయాల వద్ద యువకులు, ఆలయ కమిటీ నిర్వాహకులు, వివిధ స్వచ్ఛంద సంఘాల ఆధ్వర్యంలో గణేశుని నవరాత్రి మహోత్సవాలను ప్రారంభించారు. వినాయకుని మండపాల వద్ద రంగురంగుల ద్యుత్ దీపాలంకరణ చేశారు. భజనలు, కోలాటాలు వంటి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. రౌతులపూడిలో స్థానిక కనకదుర్గ అమ్మవారి ఆలయ సమీపంలో ఆటో యూనియన్ సభ్యులు ఏర్పాటు చేసిన వినాయకుడిని మండల స్థాయి నాయకులు, అధికారులు స్వామిని దర్శించుకున్నారు.

ప్రత్తిపాడు రూరల్: మండల వ్యాప్తంగా బుధవారం వినాయక చవితి వేడుకలను భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని ధర్మవరం, ఒమ్మంగి, రాచపల్లి, ఉత్తరకంచి, శరభవరం, పెద్దిపాలెం, ఉత్తరకంచి, గజ్జనపూడి, శరభవరం, చింతలూరు, వాకపల్లి, పోతులూరు, యూజే పురం తదితర గ్రామాల్లో వాడవాడలా మండపాలను ఏర్పాటు చేసి చవితి వేడుకలను నిర్వహించారు. చవితి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ధర్మవరంలోని గణనాథున్ని వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కిర్లంపూడి: గణపతి నవరాత్రుల మహోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక మండపాలు వెలిశాయి. కిర్లంపూడిలోని సంత మార్కెట్‌లో ఉన్న లక్ష్మీగణపతి, ఏనుగువీధి సెంటర్‌లో నిలిపిన వినాయక మండపాలను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పురోహితులు గిరిబాబుకు ఆశీర్వచనలు అందజేశారు. కార్యక్రమంలో పెంటకోట నాగబాబు, గంధం దుర్గాజీ, దేవులపల్లి వీరబాబు, అడ్వకేట్ లింగంపల్లి శివ, కరణం వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

గండేపల్లి: వినాయక చవితి వేడుకలను భక్తులు బుధవారం భక్తి శ్రద్ధలతో వైభవంగా ప్రారంభించారు. గ్రామాల్లో వీధి వీధిన ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో గణనాథుడి విగ్రహాలను నెలకొల్పి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. మండలంలోని నీలాద్రిరావుపేట, తాళ్లూరు, మల్లేపల్లి, గండేపల్లి, మురారి, తదితర గ్రామాల్లో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి మహోత్సవాలను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ప్రాంగణంలో విగ్రహాలను ప్రతిష్ఠించి వేదపండితుల మంత్రోచ్చరణలతో పూజలు జరిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఛాన్సలర్ శేషారెడ్డి, ప్రో ఛాన్సలర్ సతీష్‌రెడ్డి, డిప్యూటీ ప్రో ఛాన్సలర్ శ్రీనివాస రెడ్డి, డైరెక్టర్ శృతిరెడ్డి, హాస్టల్ ఇన్‌చార్జ్ హరీష్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తుని రూరల్: గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలో వినాయక చవితి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం గృహాల్లో వినాయక ప్రతిమలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. గ్రామాల్లో యువకులు పందిళ్లు వేసి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తపోవనం ఆశ్రమంలో పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో వేదపండితులు, వేద విద్యార్థులు చవితి పూజలు చేశారు. లోవ దేవస్థానంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో గణపతి ఉత్సవాలు నిర్వహించారు.

తొండంగి: మండలంలోని గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా బుధవారం ప్రారంభమయ్యాయి. తొండంగి హౌరాబ్రిడ్జి సెంటర్, పాత సినిమాహాల్ సెంటర్ తదితర ప్రాంతాల్లో యువత ఆధ్వర్యంలో వినాయకుని విగ్రహాలను ఊరేగింపుతో తీసుకొచ్చారు. అనంతరం విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలు ప్రారంభించారు. అదేవిధంగా ఏ.కొత్తపల్లి, శృంగవృక్షం, రావికంపాడు, పి.అగ్రహారం, బెండపూడి, పెరుమాళ్లపురం, ఏవీ నగరం, గోపాలపట్నం, పీఈ చిన్నాయపాలెం, సీతారాంపురం, కొమ్మనాపల్లి తదితర గ్రామాల్లో కూడా గణపతి నవరాత్రులు ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజులపాటు పలు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి.

**ఆకట్టుకున్న మట్టి గణపతి**

ప్రత్తిపాడు: ప్రతీ ఏటా వినాయక చవితికి ప్రత్తిపాడు గ్రామానికి చెందిన కర్రి రమ్య గణపతి విగ్రహం తయారు చేసి, నవరాత్రులు పూజలు చేయడం గత కొన్ని సంవత్సరాలుగా వస్తుంది. ఈ ఏటా కూడా మట్టి గణపతిని రూపొందించి, పూజలు నిర్వహించారు. ఈవినాయకుడు పలువురిని అకట్టుకున్నాడు. ఈ విగ్రహం తయారీకి 10 కేజీల నల్లమట్టి, ఐస్‌క్రీం స్టిక్స్, రసాయనాలు లేని సహజమైన రంగులు వినియోగించినట్లు కర్రి రమ్య తెలిపారు.

ఏలేశ్వరం: విఘ్నాధిపతి వినాయకుని చవితి వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా గణేషుని ఆలయాల వద్ద చవితి వేడుకలు నిర్వహించారు. ఏలేశ్వరంలోని పాత బస్టాండ్, అడ్డతీగల రోడ్, నర్సీపట్నం రోడ్, కాలేజీ రోడ్, లింగంపర్తి రోడ్, తోటవీధి, పెద్దవీధి, పల్లపు వీధి, పలు కాలనీల్లో వినాయకుని విగ్రహాలను నెలకొల్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు బదిరెడ్డి గోవిందు, సామంతుల సూర్యకుమార్ స్వామి వారి ఉత్సవ మండపాలను దర్శించుకుని పూజలు చేశారు. చవితి వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


**ఆకర్షణీయంగా గణేశుని విగ్రహాలు**


గోకవరం: మండలంలో వినాయకచవితి ఉత్సవాలను వాడవాడలా భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. గోకవరంలో ప్రధాన రహదారి చెంత ఉన్న శ్రీవిఘ్నేశ్వరస్వామి ఆలయంలో నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో భారీ గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన బత్తుల మల్లిఖార్జునరావు రూ.2 లక్షలతో రెండు కేజీల వెండి కవచం చేయించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామికి ఈ కవచాన్ని అలంకరించారు. అలాగే స్థానిక గుబ్బాలమ్మ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద రూ.1.80 లక్షలతో హైదరాబాద్ నుంచి **15 అడుగుల గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.**


ప్రత్తిపాడులో రూపుదిద్దుకున్న మట్టి విగ్రహం


తపోవనంలో గణపతి పూజ చేస్తున్న సరస్వతీ మహాస్వామి


ధర్మవరంలో గణనాథుడిని దర్శించుకుంటున్న మురళీకృష్ణంరాజు


ఏలేశ్వరంలో వినాయకుని ఆలయం వద్ద పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


రౌతులపూడిలో గణపతి విగ్రహాన్ని దర్శించుకుంటున్న ఎస్సై వెంకటేశ్వరరావు


తునిలో దాడిశెట్టి రాజాను ఆశీర్వదిస్తున్న పండితులు


కిర్లంపూడి సంతమార్కెట్‌లోని లక్ష్మీగణపతిని దర్శించుకుంటున్న గిరిబాబు

## రత్నగిరిపై ఘనంగా వేడుకలు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని సన్నిధిలో గణపతి నవరాత్రి ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. సత్యదేవుని అనివేటి మండపంలో వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పండితులు పూజలు చేశారు. వినాయకుని ఆవిర్భావం, స్వామిని పూజించిన వారికి కలిగే సిరిసంపదలు, చంద్రుడిని చూస్తే కలిగే నీలాపనిందల ఇతిహాసం తదితర విషయాలను వేదిక కమిటీ సభ్యుడు, కల్యాణ బ్రహ్మ ఛామర్తి కన్నబాబు వివరించారు. కార్యక్రమంలో ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులు పాల్గొన్నారు.

**50 చోట్ల గణపతి మండపాలు**

అన్నవరంలో 50 చోట్ల గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. తొమ్మిది రోజులపాటు గణపతి నవరాత్రులు ఘనంగా నిర్వహించిన అనంతరం పంపా నదిలో నిమజ్జనం చేస్తారు.


ప్రత్యేక అలంకరణలో వినాయకుడు